మళ్లీ గెలిస్తే రూ.400కే సిలిండర్

● మంత్రి ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే రూ.400లకే సిలిండర్ అందిస్తామని మంత్రి ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఏర్గట్ల మండలం తడపాకల్‌లోని శ్రీకోదండ రామాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి ఎన్నికల ప్రచారం ఆరంభించారు. గుమ్మిర్యాల్, తడపాకల్, తాళ్ల రాంపూర్, నాగేంద్రనగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ.. మోదీ గ్యాస్ సిలిండర్‌ల ధరలు పెంచితే కేసీఆర్ మాత్రం తక్కువ ధరకే మహిళలకు కానుకగా ఇవ్వనున్నారని చెప్పారు. పింఛన్ క్రమ క్రమంగా పెంచడం, రైతు బంధు రూ.16వేల వరకు పెంచడం చేస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండబట్టే రాష్ట్రం సుభిక్షంగా ఉందని చెప్పారు. రైతు బీమా మాదిరిగా రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి



తడపాకల్ కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

బీమా సౌకర్యం కల్పించనున్నారని పేర్కొన్నారు. ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకు రావడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, రాజాపూర్ణనందం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో..

వేల్పూర్: వేల్పూర్, భీమ్‌గల్, మోర్తాడ్, ఏర్గట్ల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్



గుమ్మిర్యాల్‌లో మాట్లాడుతున్న మంత్రి

నాయకులు, కార్యకర్తలు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం వేల్పూర్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. అక్లూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డి, ఇతర కార్యకర్తలు, భీమ్‌గల్‌కు చెందిన చెవ్వ అశోక్, ఫణీంద్ర, ప్రసన్నకుమార్, సుంకెట్‌కు చెందిన వార్డు సభ్యుడు చిన్నారెడ్డి, గుమ్మిర్యాల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శంకర్, గంగమల్లు, బీజేపీ నాయకులు సునీల్, మహేశ్, కిష్టయ్య తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీజేపీతోనే సుస్థిర పాలన



గాండ్లపేట్‌లో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ

మోర్తాడ్: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని ఆ పార్టీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని గాండ్లపేట్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. సంక్షేమం పేరిట దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు కేంద్రం నిధులే ప్రధానం అన్నారు. బీజేపీ రైతుల సంక్షేమం, ప్రజల బాగోగుల గురించి ఆలోచిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు తమ జేబులు నింపుకునే పనిలో ఉన్నాయని ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే పథకాలు

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు ఇస్తున్నారని బీజేపీ



బీజేపీలో చేరుతున్న నాయకులు

అభ్యర్థి అన్నపూర్ణమ్మ ఆరోపించారు. వేల్పూర్ మండలం లక్కోర, అమీనాపూర్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ప్రజలందరికీ పక్కా ఇళ్లు, ఉచిత విద్య, వైద్యం రావాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు. ఎంపీ అర్వింద్ చొరవతో నిజామాబాద్‌కు పసుపు బోర్డు వచ్చిందన్నారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండలాధ్యక్షుడు ఏలేటి రమేశ్‌రెడ్డి, పుప్పాల నరేశ్, నర్సారెడ్డి, రవి, మల్లికార్జున్, మహేశ్, యశ్వంత్, సాగర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘ సభ్యులు శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థి ఏలేటీ అన్నపూర్ణమ్మ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలాధ్యక్షుడు ములిగే మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటు విలువైనది

బోధన్‌టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని జిల్లా స్వీప్ నోడల్ అధికారి సురేష్ కుమార్, సెంట్రల్ బ్యూరో కమ్యునికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి ధర్మనాయకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో కేంద్ర మంత్రిత్వ శాఖ,సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. శాసనసభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికే అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మద్యానికి, డబ్బుకు, ప్రలోభాలకు లోనై ఓటు వేయొద్దని కోరారు. అనంతరం ఓటు హక్కుపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, మహిళా సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ, అదనపు డీఆర్‌డీవో సంజీవ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం పాల్గొన్నారు.

అవినీతి వ్యతిరేక ర్యాలీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల, పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు అవినీతి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అంతకుముందు కళాశాల యాజమాన్యం అవినీతి వ్యతిరేక ఉద్యమ ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీనగర్ పాఠశాలలో వైద్య శిబిరం



వర్ని: మండలంలోని శ్రీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీను నాయక్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 68 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ సంజయ్, పాఠశాల హెచ్ఎం గంగమణి పాల్గొన్నారు.

బోర్గాంలో..



రెంజల్: మండలంలోని బోర్గాంలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి ప్రజల నుంచి స్పందన లభించినట్లు బోధన్ డివిజన్ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు అష్ఫాఖ్ అహ్మద్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొబైల్ మెడికల్ కిట్ ద్వారా వృద్ధులకు ఉచిత సంచార వాహన వైద్య సేవలను అందిస్తున్నట్లు వివరించారు. కరిపే రవీందర్, సాయికిరణ్, రామకృష్ణ, పుట్టి నాగన్న, సిద్ధ పోశెట్టి పాల్గొన్నారు.

రిలే దీక్షలు కొనసాగిస్తాం



బోధన్: షుగర్ ఫ్యాక్టరీ మూసివేత నాటి నుంచి తమకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఎన్డీఎస్ఎల్ కార్మిక సంఘం నాయకుడు నాగేశ్వర్ అన్నారు. కార్మికులు శక్కర్‌నగర్ షుగర్ ఫ్యాక్టరీ ప్రధాన గేటుకు ఎదురుగా చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 91వ రోజుకు చేరాయి. దీక్షలో అన్వర్ మియా, రఘునాథ్ కూర్చున్నారు.

గోశాలకు గడ్డి వితరణ

రుద్రూర్: రుద్రూర్‌లోని గోశాలలో ఉన్న జీవాల కోసం కోటగిరికి చెందిన పాల అశ్విన్ సేట్ గడ్డి అందచేశారు. శుక్రవారం ట్రాక్టర్ నిండా గడ్డి కట్టలను నింపి గోశాలకు పంపించారు. హవగిరిరావ్ దేశాయ్, నవీన్, నరేందర్ తదితరులు ఉన్నారు.

జీవాలకు పీపీఆర్ టీకాలు



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌లో గొర్రెలకు పీపీఆర్ టీకాలను పశు వైద్యాధికారి గౌతంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం అందించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన దాణా, మందులను ఉచితంగా అందజేశారు. గోపాల మిత్రలు జ్యోతి, ప్రణీత్, మల్లయ్య, షకీల్ పాల్గొన్నారు.

షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి



మాట్లాడుతున్న బుద్దె రాజేశ్వర్

బోధన్: బీఆర్‌ఎస్ బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్‌ను ఆశీర్వదించి మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నియోజక వర్గ నాయకుడు బుద్దె రాజేశ్వర్ కోరారు. శుక్రవారం సాలూర మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింట ప్రచారం చేశారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టో కరత్రాలను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, డిస్కో సాయిలు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికావు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌టౌన్: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్ పెద్ద మనిషి అని చూడకుండా ఎమ్మెల్యే షకీల్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని యువజన కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తలారి నవీన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. మైనారిటీలను ఎమ్మెల్యే ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని, వారిపై కురిపిస్తున్న ప్రేమ కేవలం ఓట్ల కోసమే అని ఆరోపించారు. మొయినొద్దీన్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



బోధన్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని ఎన్నికల నియోజకవర్గ ఆర్వో, ఆర్డీవో రాజాగౌడ్ ప్రజలను కోరారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అధికార యంత్రాంగం, ఉద్యోగులు, ప్రజలందరూ తప్పని సరిగా పాటించాలని సూచించారు. శుక్రవారం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆర్వో విడుదల చేశారు. ఆర్డీవో ఆఫీసు డీఏవో విఠల్, తహసీల్దార్ గంగాధర్ ఉన్నారు.

కేంద్ర బలగాల కవాతు



రుద్రూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రుద్రూర్/వర్ని/ఎడపల్లి/రెంజల్/బోధన్‌టౌన్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. రుద్రూర్, మోస్రా, ఎడపల్లి, జానకంపేట, నీలా, రెంజల్, సాటాపూర్, బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్‌లో శుక్రవారం పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటును అమ్ముకోవద్దని కోరారు. ఏసీపీలు రవీందర్, వేణుగోపాల్, అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నందవార్, రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఎస్సైలు ఉదయ్‌కుమార్, విక్రం, సందీప్, సిరేష్, కృష్ణకుమార్, రాబిన్ బాబు, జాట శంకర్ పాల్గొన్నారు.



మోస్రాలో..



బోధన్‌లో..



ఎడపల్లిలో..

బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

మోపాల్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని తన నివాసంలో బోర్గాం(పి) 5వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు నుడా చైర్మన్ సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాజిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బాజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. నాయకులు చిట్టి పండరి, శ్యామకూర సాయిరెడ్డి, గోపి, విజయ్, శ్యాంరావు, గంగాధర్, తదితరులు 50 మంది పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, హన్మండ్లు, దాస్, శ్రీనివాస్, భూషణ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే చేరికలు

ధర్పల్లి: రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలకు ఆకర్షితులై చాలా మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. శుక్రవారం నగరంలోని తన నివాసంలో మండలంలోని రామడుగు, ధర్పల్లి, గోవిందపల్లి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని పేర్కొన్నారు.

బాజిరెడ్డికి మద్దతుగా తీర్మానం

ధర్పల్లి: మండలంలోని దమన్నపేట సర్పంచ్ కొండ శేఖర్ ఆధ్వర్యంలో రజక సంఘం సభ్యులు శుక్రవారం బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా తీర్మానం చేశారు. ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని గోవర్ధన్‌కు శుక్రవారం అందజేశారు. బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీ మూడోసారి గెలిపించుకుంటామని రజక సంఘం సభ్యులు తెలిపారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలని చండీహోమం



బోధన్: నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకుంటు పట్టణంలోని తన ఇంట్లో సుదర్శన యాగం, చండీ హోమం నిర్వహించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సతిమణీ శ్రీదేవితో కలిసి హోమం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేరికలు..

బీజేపీలో..



మాక్లూర్: మాక్లూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎం రవియాదవ్ ఆధ్వర్యంలో అంకాపూర్‌లోని ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పైడి రాకేష్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో చేరికలు జరిగాయి. మండలంలోని మాణిక్‌బండార్, మాక్లూర్ గ్రామాల నుంచి నరేష్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రమణ, రాజు, సతీష్, వినోద్, నరేష్, శివ, ప్రసాద్‌లు బీజేపీలో చేరగా రాకేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. నాయకులు మదారి రాజేశ్వర్, చింత ప్రవీణ్‌రెడ్డి, రమేష్, రాథోడ్ రాజశేఖర్, చౌహాన్ అశోక్, శ్రావణ్‌కుమార్, రాములు నాయక్, సురేష్ పాల్గొన్నారు.

మోహన్‌రెడ్డి సమక్షంలో..

రెంజల్: రెంజల్‌కు చెందిన పలువురు యువకులు శుక్రవారం బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన యువకులు ఆయన సమక్షంలో కాషాయ



కండువా కప్పుకున్నారు. గ్రామ రైతు సమితి అధ్యక్షుడు కత్తి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరి కొందరు పార్టీలో చేరారు. బీజేపీ మండలాధ్యక్షుడు గోపీకృష్ణ, చుక్కరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో..



బోధన్: బోధన్, సాలూర మండలాల్లోని సాలూర, సాలంపాడ్, రాంపూర్ గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు నీలకంఠరావు, అల్లె వెంకటేష్, గొరిగే శంకర్ పటేల్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ గుప్తా, తట్టికోట కాలనీకి చెందిన బీజేపీ కార్యకర్త పురాణం కిరణ్ శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ ఆఫీసులో ఆ పార్టీలో చేరారు. పార్టీ నియోజక వర్గ ముఖ్య నాయకులు తూము శరత్ రెడ్డి, గంగాశంకర్, గణపతి రెడ్డి, నాగేశ్వర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్‌గౌసోద్దీన్,అల్లె రమేష్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

■ **వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన**



రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలిలో విగ్రహాల ప్రతిష్ఠాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి విగ్రహంతో పాటు పలు ప్రదేశాల్లో పోతలింగన్న, గజ్జెలమ్మ, నందీశ్వరుడు, శివపార్వతులు, గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పలువురు దాతలు విగ్రహాల ఏర్పాటుకు సాయం అందించారని సర్పంచ్ సునిత తెలిపారు.

■ **నిమిషాంబ దేవి ఆలయంలో పూజలు..**

బాల్కొండ: బాల్కొండలోని నకాశీ సంఘం ఆధ్వర్యంలో నిమిషాంబ దేవీ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెల మొదటి శుక్రవారం అన్నదానం నిర్వహిస్తారు. అందులో భాగంగానే పూజలు, అన్నదానం చేశారు.

■ **సమాధుల పండుగ**



బోధన్‌టౌన్: పట్టణ శివారులోని క్రిస్టియన్ గ్రేవ్ యార్డులో గురువారం రాత్రి సమాధుల పండుగను నిర్వహించారు. సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. సీఎస్ఐ చర్చీ పాస్టర్ ప్రభాకర్ మాట్లాడారు. అనిల్, జ్యోతిరాజ్, ఎడ్వర్డ్, దాస్, సుదీప్, మర్సబాస్ ఉన్నారు.

■ **శారదాదేవి విగ్రహ నిమజ్జన మహోత్సవం**



బోధన్‌టౌన్: పట్టణంలోని బ్రహ్మణగల్లీలో శుక్రవారం శరదాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శారదాదేవి అమ్మవారి విగ్రహా నిమజ్జన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ, శారదా దేవి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

● మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకొని బియ్యం అందించని రైస్‌మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు క్వింటాలుకు 8 కిలోల వరకు కడ్తా తీసుకుంటున్నారని ఆరోపించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కడ్తా రెండు కిలోలు తీసుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో నందిపేట్ మండలంలో లక్కంపల్లి సెజ్ ఏర్పాటు చేసినా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫుడ్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప తర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు.

సీఎం సభకు తరలివచ్చిన ప్రజలు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని సిద్దుల గుట్ట సమీపంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్మూర్ నియెజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. సీఎం కేసీఆర్ సభ వచ్చేవరకు ప్రజలు ఓపికగా ఉండి సీఎం ప్రసంగాన్ని విన్నారు. రానున్న ఎన్నికల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ బైక్ ఎవరిది



రాణాకలాన్ శివారులో ఉన్న బైక్

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ శివారులో 20 రోజులుగా ప్రధాన రహదారి పక్కన ఓ బైక్ పార్క్‌చేసి ఉంది. ఈ బైక్ (టీఎస్01 ఈకే 3629) ఎవరిదై ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను దొంగలించి ఇక్కడ వదిలి వెళ్లారేమె అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బైక్ పార్క్ చేసి ఉన్న విషయాన్ని ఎడపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



సంబురాలు నిర్వహిస్తున్న నాయకులు

వర్ని(మోస్రా): యెండల లక్ష్మీనారాయణకు బీజేపీ బాన్సువాడ టికెట్ కేటాయించడంతో ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మోస్రాలో సంబురాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలం అందరం కలిసి యెండల విజయానికి కృషి చేస్తామన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కోనపురం స్వామి, సాయిలు, సుదర్శన్ గౌడ్, నూలు శివ, హనుమగౌడ్, వినోద్, భరత్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఘోస్ట్- 10.15,
టైగర్ నాగేశ్వరరావు - 12.40, 7.05
నరకాసుర (తెలుగు) - 4.05
భగవంత్ కేసరి (తెలుగు) - 10.30

స్క్రీన్-2 – మా ఊరి పొలిమేర-2 (తెలుగు) - 10.25, 1.15, 7.30, 10.20
లియో (తెలుగు) - 4.05

స్క్రీన్-3 – కీడాకోలా - 11.20, 2.00,4.40,7.20, 10.00

స్క్రీన్-4 – భగవంత్‌కేసరి(తెలుగు)-12.45,6.35
విధి (తెలుగు)-4.10, శంకర్‌దాదా ఎంబీబీఎస్ - 10.00

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తక్షణ ప్రవేశాల (స్పాట్ అడ్మిషన్స్)కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ (హెచ్ఈపీ), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్-బీజెడ్‌సీ), బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్- ఎంపీసీ, ఎంపీసీఎస్) కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈ 9177563723, 9705336530, 9440019918 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'పవర్ డిప్లొమా ఇంజినీర్స్' కార్యదర్శిగా రాజశేఖర్

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంఘం ఎన్నికలు గురువారం రాత్రి వరంగల్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుంచి తోట రాజశేఖర్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీనాథ్, శ్రీనివాస్ తదితరులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు.



తోట రాజశేఖర్